క్లుప్తంగా

శ్రీవారికి ప్రత్యేక పూజలు



సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్‌లో గల అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిత్రకవి శ్యామ్ ఆచార్యులు రామానుజ దాసన్ గోత్రనామాలతో అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్రీడాకారులకు దుస్తులు పంపిణీ



నకరికల్లు: గ్రామీణ ప్రాంతాలలోని క్రీడాకారులను వెలుగులోకి తెచ్చేందుకు ఆడుదాం ఆంధ్రా క్రీడలు దోహద పడతాయని మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి అన్నారు. మండలంలోని దేచవరంలో క్రీడాకారులకు సోమవారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలలో గ్రామీణ ప్రాంతాలలోని క్రీడాకారులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ భవనం రమణారెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షులు దొండేటి కోటిరెడ్డి పాల్గొన్నారు.

నేడు ఆడుదాం ఆంధ్రా ప్రారంభం

అమరావతి: ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించటానికి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని మంగళవారం పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు ప్రారంభిస్తారని ఇన్‌చార్జి ఎంపీడీవో గంగాధర శ్రీనివాస్ సోమవారం తెలిపారు. స్థానిక శ్రీ రామకృష్ణ హిందూ హైస్కూల్‌లో ఉదయం 10గంటలకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొంటారని తెలిపారు. ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేడు వంగవీటి మోహన్‌రంగా వర్ధంతి

సత్తెనపల్లి: విజయవాడ తూర్పు మాజీ శాసన సభ్యుడు, కాపు సంఘ నేత కీర్తిశేషులు వంగవీటి మోహన్‌రంగా 35వ వర్ధంతి ఈనెల 26న ఉదయం 9 గంటలకు పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో జరుగుతుందని పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి సోమవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరవుతారన్నారు. కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, పట్టణ నాయకులు, కార్యకర్తలు, రంగా అభిమానులు హాజరుకావాలని కోరారు. అలాగే పట్టణంలోని గార్లపాడు బస్‌స్టాప్ సెంటర్‌లో రంగా కాంస్య విగ్రహం వద్ద ఉదయం 10 గంటలకు రంగా వర్ధంతి జరుగుతుందని కాంస్య విగ్రహ కమిటీ సభ్యులు తెలిపారు. రంగా వర్ధంతిలో భాగంగా అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కాపు సోదరులు, రంగా అభిమానులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు అమ్మవారి తిరునాళ్ల

గురజాల : పట్టణంలో వేంచేసియున్న పాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్ల మంగళవారం నిర్వహించడం జరుగుతుంది. తిరునాళ్ల మొదటి రోజు కొలత చేపట్టిన బియ్యం సోమవారం రాత్రి విడుపు తీసి కొలవగా బియ్యం రెట్టింపు అవుతాయని భక్తుల నమ్మకం. నేడు తిరునాళ్ల సందర్భంగా అమ్మవారి దేవాలయం విద్యుత్ వెలుగులతో తీర్చిదిద్దారు. మంగళవారం సాయంత్రం శిడిమాను ఉత్సవం ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంటుంది.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



దాచేపల్లి : రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన పొందుగల రైల్వేస్టేషన్ వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగింది. సుమారు 50 సంవత్సరాల వయస్సున వ్యక్తి రైలు పట్టాలు దాటుతున్న క్రమంలో రైలు ఢీకొట్టటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతుడి వివరాలు తెలిసిన వారు నడికుడి జీఆర్పీ పోలీసులను సంప్రదించాలని హెడ్‌కానిస్టేబుల్ సునీల్ చెప్పారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

- పట్టణం, మండలంలోని అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- పాస్టర్లు, క్రైస్తవ పెద్దల వాక్యోపదేశాలు
- నృత్యాలు, నాటికలు ప్రదర్శించిన యువత



సత్తెనపల్లి లూథరన్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం



సత్తెనపల్లిలో సందేశం ఇస్తున్న పాస్టర్లు రెవ స్వరూప్, రెవ దయానంద్

సత్తెనపల్లి: ఏసుక్రీస్తు జననం సర్వజనులకు శుభదినమని, ప్రజలందరూ క్రీస్తు చూపిన మార్గంలో నడుచుకోవాలని వక్తలు సూచించారు. మహితాత్ముడైన ఏసుక్రీస్తు అవతరించిన వేళ .. క్రిస్మస్ సంబరాలు పట్టణం , మండలంలో సోమవారం అంబరాన్నంటాయి. ప్రభువు రాకను స్వాగతిస్తూ విశ్వాసులు ఈ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. చర్చిలు కిటకిటలాడాయి. చర్చిల్లో స్తుతి గీతాలు ఆలపించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్యాండిల్ సర్వీస్ చేశారు. కేక్ కట్ చేసి పంచారు. వృద్ధులకు, పేదలకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. తమ కోసం శిలువపై రక్తం చిందించిన ఆ కరుణామూర్తి త్యాగశీలతను.. ఆ ప్రభువు అందించిన ప్రేమైక జీవన స్ఫూర్తిని తలుచుకున్నారు. తన యందు విశ్వాసముంచిన వారి కష్టాలను ఆ క్రీస్తు తొలగించి... సమాధాన పరుస్తారని పాస్టర్లు సందేశం అందించారు. ప్రార్థనా మందిరాల్లో చిన్నారులు, యువతీ, యువకులు క్రిస్మస్ సందర్భంగా యేసు జనన వృత్తాంతాన్ని ప్రదర్శించారు. సాటి మనుషుల పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, శత్రువుల పట్ల క్షమా వంటి క్రీస్తు సందేశాలు మనలను సన్మార్గంలో నడిపించాలని, అందరిపై క్రీస్తు ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు.

ముప్పాళ్ళలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లోను క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. క్రీస్తు రాకను పురస్కరించుకొని అర్ధరాత్రి నుంచే ఆయా గ్రామాల్లోని చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చిలను విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఆయా చర్చిలలోని సంఘకాపరులు క్రీస్తు సందేశాన్ని వినిపించారు. పలుదేవర్లపాడు, నార్నెపాడు, గోళ్లపాడు, ముప్పాళ్ళ, ఇరుకుపాలెం గ్రామాలతో పాటు అన్ని గ్రామాల్లోని చర్చిలలో సామూహిక ప్రార్థనల్లో మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

రాజుపాలెంలో క్రిస్మస్ వేడుకలు

రాజుపాలెం: మానవాళి జీవితాలలో వెలుగులు నింపేందుకే ఏసుక్రీస్తు భూమిపై అవతరించినట్లు ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డిలు అన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలోని చర్చిలలో క్రిస్మస్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పాస్టర్లు క్రీస్తు బోధనలను ఆలపించారు. ఆకుల గణపవరంలో ఎస్సీ కాలనీలోని ఏబీఎం చర్చిలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి క్రిస్మస్ కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. రాజుపాలెంలో ఆర్ అండ్ ఆర్ చర్చిలో సర్పంచ్ పులిబండ్ల అశోక్, జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణలు క్రిస్మస్ కేక్‌లను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. రాజుపాలెం జయంతీ కాలనీ చర్చిలో పాస్టర్ మత్తయ్య మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరు అనుసరించాలని తెలిపారు. కార్యక్రమంలో జీడీసీఎంసీ డైరెక్టర్ ఆదినారాయణ, కేదారి నాగేశ్వరరావు, సర్పంచ్ బొలమాల నాగమల్లేశ్వరరావు, మాజీ సర్పంచ్ గన్నుపల్లి వెంకటరమణబుల్లిబాబు, సీహెచ్ బాలిరెడ్డి, మెరుగు విఘ్నేష్, నాయుడు హరిబాబు, గల్లా ప్రభాకర్, వేమవరపు యాకోబు, గోసంగి అమూల్య, తదితరులున్నారు.

బెల్లంకొండలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

బెల్లంకొండ: మండలంలోని వివిధ గ్రామాలలో సోమవారం క్రిస్మస్ వేడుకలను క్రైస్తవ సోదరులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని బెల్లంకొండ, నాగిరెడ్డిపాలెం, పాపాయపాలెం, చంద్రాజుపాలెం , మన్నెసుల్తాన్‌పాలెం, వెంకటాయపాలెం, నందిరాజుపాలెం గ్రామాలలోని చర్చిలలో క్రిస్మస్ ప్రార్థనలు మారుమోగాయి. ఆదివారం రాత్రి నుంచి ప్రారంభమైన ఉపవాస ప్రార్థనలు సోమవారం తెల్లవారుజాము వరకూ చేశారు. ఆదివారం అర్ధరాత్రి కేకులను కట్ చేసి క్రైస్తవ సోదరులు బాల యేసు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వివిధ గ్రామాలలో సోమవారం రాత్రి బాలయేసు తేరు ఊరేగింపు కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు.

క్రోసూరులో ఘనంగా క్రిస్మస్ పండుగ

క్రోసూరు: క్రిస్మస్ పండుగను క్రైస్తవులు సోమవారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. క్రోసూరు, అనంతవరం, దొడ్లేరు, ఆవులవారిపాలెం, పెరికపాడు, హసనాబాద్, నాగవరం, ఉయ్యందన, 88త్యాళ్లూరు, పీసపాడు, ఎర్రబాలెం, బాలెమర్రు, అందుకూరు, విప్పర్ల, ఊటుకూరు, బయ్యవరం గ్రామాల్లోని చర్చిల్లో, ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రీస్తు నడిచిన మార్గంలో ప్రజలందరూ నడవాలని అన్నారు. శాంతి, క్షమ, దయ కలిగి ఉండాలన్నారు. క్రోసూరు ఏఈఎల్ చర్చిలో భక్తులు అశేషంగా పాల్గొన్నారు.

వైభవంగా బాలయేసు తిరునాళ్ల మహోత్సవాలు



ఏసుక్రీస్తు సందేశాన్ని పఠిస్తున్న విచారణ గురువులు



విద్యుత్ దీప కాంతులతో బాలయేసు చర్చి

అచ్చంపేట: క్రిస్మస్ వేడుకలలో భాగంగా మండలంలోని తాళ్లచెరువులోని బాలయేసు దేవాలయంలో తిరువాళ్ల మహోత్సవాలు సోమవారం వైభవంగా జరిగాయి. వేకువ జాము నుంచే భక్తులు బాలయేసు మందిరానికి తరలివచ్చి కొవ్వొత్తులు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విద్యుత్ దీప కాంతులతో బాలయేసు చర్చి ఎంతో ఆకర్షణీయంగా రూపుదిద్దుకోంది. విచారణ గురువులు పుట్టి అంతోనిరాజు, సహాయ గురువులు కఠారి కిరణ్, ఫాదర్ పాతిమా మర్రెడ్డిలు బైబిల్ పఠనచేసి ఏసుక్రీస్తు సందేశాన్ని తెలియచేశారు. ఎదుటి వారి పట్ల ప్రేమ, దయ కలిగి ఉండాలని, పొరుగు వారిని ప్రేమించాలని, ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తం అందించాలని ప్రబోధించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బాలయేసు స్వరూపంతో అలంకరించిన తేరు ప్రదక్షిణ మహోత్సవం కనుల పండుగగా జరిగింది. తాళ్లచెరువు గ్రామవీధులలో మేళతాళాలు, బాణసంచాలతో తేరు ఊరేగింపు ఆకట్టుకుంది. మండలంలోని పలు గ్రామాలలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి.

ప్రేమ, శాంతి మార్గం క్రీస్తు సందేశం



ఏఈఎల్ చర్చిలో క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు:ప్రేమ, శాంతి, సమాధానం ఇదే క్రిస్మస్ సందేశం అని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. సోమవానం క్రోసూరులోని ఇమ్మానియేలు లూథరన్ శతవార్షిక దేవాయలంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ రెవ. డా.సుందరరావు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ శత్రువుల పట్ల కూడా క్షమాగుణం కలిగి ఉండాలని క్రీస్తు సందేశమిచ్చారన్నారు. ఏసుక్రీస్తు జననానికి గుర్తుగా జరుపుకునే క్రిస్మస్ పర్వదినం నేపథ్యంలో అందరి ఇంట సుఖశాంతులు, సంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఏ మతం అయినా విశ్వశాంతినే కోరుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, క్రైస్తవ సోదరులు, భక్తులు పాల్గొన్నారు.

అచ్చంపేట: మండలంలోని తాళ్లచెరువు బాలయేసు దేవాలయంలో సోమవారం జరిగిన క్రిస్మస్ వేడుకలలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొన్నారు. చర్చి ఫాదర్స్, విచారణ గురువుల ఆశీర్వాదాన్ని పొందారు. విచారణ గురువులు ఏసుక్రీస్తుకు ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఏసు మార్గంలో నడవాలని, సాటి వారి పట్ల ప్రేమ, కరుణ, శుత్రువుల పట్ల క్షమాగుణం కలిగి ఉండాలని కోరారు. ఆయన వెంట జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, సర్పంచ్ కిక్కురు అల్లారెడ్డి, మాజీ సర్పంచ్ తుమ్మా చిన్నపరెడ్డి, గ్రామపార్టీ కన్వీనర్ బాలశౌరెడ్డి, బెల్లంకొండ ఎంపీపీ వెంకటేశ్వరరెడ్డి తదితరులున్నారు.



పలుదేవర్లపాడులో సామూహిక ప్రార్థనల్లో క్రీస్తు సందేశాన్ని అందిస్తున్న పాస్టర్ ఇజ్రాయేల్



క్రిస్మస్ సందర్భంగా క్రోసూరు ఏఈఎల్ చర్చికి హాజరైన భక్తులు



గణపవరం చర్చిలో క్రిస్మస్ వేడుకలలో ఎంపీపీ, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్

ఎమ్మెల్యే నంబూరును విమర్శించే స్థాయిలేదు

టీడీపీలో చేరిన కంచేటిసాయి చేసిన విమర్శలను ఖండించిన నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

క్రోసూరు: తోడేళ్లు, గుంటనక్కలు మనషుల వేషంలో కొత్తపాటలు పాడితే ప్రజలు మోసపోరని తెలుసుకోవాలని, అవినీతిపరులు, నేరస్థులైన మీరు ఎమ్మెల్యే నంబూరు శంకరరావుని విమర్శించేంత అర్హులు కారని, పెదకూరపాడు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీని ఎదుర్కొనటం మీ తరం కాదని, మీకు చేతనైతే పెదకూరపాడు నియోజకవర్గంలో అచ్చెన్నాయుడు, చంద్రబాబు, లోకేశ్ ఎవరినైనా నిలబెట్టుకోండి, ఓడించకపోతే రాజకీయాల నుంచే విరమించుకుంటానని క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి బహిష్కరించబడిన కంచేటి సాయిబాబు, మరో ఇద్దరు ఆదివారం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు సమక్షంలో టీడీపీలో చేరి ఎమ్మెల్యే నంబూరును విమర్శించటం పట్ల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం విలేకరుల సమావేశంలో తీవ్రంగా ఖండించారు. క్రోసూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి అధ్యక్షత వహించారు. మాజీ జెడ్పీటీసీ చిల్కా పెద్దబాబు మాట్లాడుతూ కంచేటి సాయిబాబు హత్యా రాజకీయాలు, దళిత వ్యతిరేక, మోసపూరిత రాజకీయాలు చేస్తూ 20 సంవత్సరాల రాజకీయ చరిత్రలో ఎక్కడా స్థిరంగా ఉండని వ్యక్తి అని అన్నారు. దళితుడిని గడ్డివాములో దహనం చేసిన రాజకీయచరిత్ర వారిదన్నారు. నియోజకవర్గంలో వీరి బలం ఏంటో ప్రజలందరికీ తెలుసు. ఎమ్మెల్యే నంబూరుది అనాదిగా రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబమని అన్నారు. జెడ్పీటీసీ షేక్ జమీలాగఫూర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే నంబూరు శంకరరావును ఇక్కడే ఉంచుతారా అని చంద్రబాబు అనటంలో అర్థం లేదన్నారు. అసలు పెదకూరపాడు నియోజకవర్గంలో టీడీపీ ఎవరిని నిలబెడుతుందో ధైర్యంగా చెప్పగలవా అని బాబును ప్రశ్నించారు. సమావేశంలో ఏఎంసీ వైస్ చైర్మన్ గార్లపాటి దాసు, లిడ్‌క్యాప్ స్టేట్ డైరెక్టర్ ఎక్కిరాల మురళి, క్రోసూరు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ వెలది అప్పారావు, ఎంపీటీసీ చిల్కా రవి, విప్పర్ల మాజీ సర్పంచ్ నర్రా వాసుదేవరావు, సొసైటీ చైర్మన్ అనుముల కోటిరెడ్డి, పాశం శ్రీనివాసరెడ్డి, ఉప్పుటూరి రవీంద్రబాబు, రాచమంటి హనుమంతరావుయాదవ్, కృష్ణారెడ్డిలు ప్రసంగించారు.

చాగంటివారిపాలెంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర



చాగంటివారిపాలెంలో డ్రోన్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం సోమవారం జరిగింది. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొని కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు డ్రోన్ ద్వారా పురుగుమందు చల్లే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వీఏఏ శైలజ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేతలకు బహుమతులు పంపిణీ

దుర్గి: క్రిస్మస్ సందర్భంగా కంచరగుంట గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మాదాసు వాసు ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా వాలీబాల్ పోటీలు నిర్వహించారు. మొత్తం నాలుగు జట్లు పోటీలో పాల్గొనగా విన్నర్‌గా నిలిచిన రవిరాజు జట్టుకు వైఎస్సార్‌సీపీ నాయకులు మాదాసు వాసు షీల్డ్‌తో పాటు రూ.2,000 నగదును అందజేశారు. రన్నర్‌గా నిలిచిన కోట శంకర్ జట్టుకు, ఎంపీటీసీ బొంత కృష్ణ షీల్డ్‌తో పాటు రూ.వెయ్యి నగదు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బీర్నిడి చంద్రయ్య, బీర్నిడి బంగారయ్య, సచివాలయం కన్వీనర్ బీర్నిడి దానయ్య, పృధ్వి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుకు గురైన ఘటనపై విచారణకు ఆదేశం



నకరికల్లు: విద్యార్థుల రక్షణకై ఉపాధ్యాయులు పటిష్ట చర్యలు తీసుకోవాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. నకరికల్లులోని కేజీబీవీ ఆవరణలో ఈ నెల 19వ తేదీన విద్యార్థిని పాము కాటు కు గురైన విషయమై ఆమె తీవ్రంగా స్పందించా రు. విద్యార్థినులు దుస్తులు ఆరవేసుకునే ఖాళీ స్థ లంలో లైట్లు కూడా లేవని ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ మేరకు తక్షణమే ఈ ఘటనపై విచారణ జరిపి నివేదిక అందించాలని పల్నాడు జిల్లా వి ద్యాశాఖాధికారిని ఆదేశించినట్లు ఆమె తెలిపారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముప్పాళ్ళ: పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందు తూ మృతి చెందిన ఘటన మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో సోమవారం జరి గింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివ రాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఆనె కల్లు జయసింహారెడ్డి(33) అనే వ్యక్తి పొలం వద్ద వివా దం నేపథ్యంలో ఈ నెల 3వ తేదీన ఎలుకలమందు తిని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. నరసరావుపేటలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భా ర్య, ఇద్దరు పిల్లలున్నారు. కుటుంబసభ్యుల ఫిర్యా దు మేర దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.కిశోర్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శికి సత్కారం



వెలుగూరి శరత్‌బాబును సత్కరిస్తున్న ఆర్యవైశ్య సేవా సమితి సభ్యులు

సత్తెనపల్లి: పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థాన కళ్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఇటీవల నియమితులైన వెలుగూరి శరత్‌బాబును సోమవారం ఆర్యవైశ్య సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సేవా సమితి గౌరవ అధ్యక్షుడు జమిలి రాధాకృష్ణ మూర్తి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా పార్టీల్లో పదవులు పొందిన నేతలను సత్కరించటం ఆనవాయితీగా చేస్తున్నామన్నారు. పలువురు వక్తలు వెలుగూరి చేస్తున్న సేవా కార్యక్రమాలకు తగిన గుర్తింపు రాష్ట్ర స్థాయిలో రావటం శుభ పరిణామమన్నారు. కార్యక్రమంలో సేవా సమితి కోశాధికారి మద్ది వెంకటేశ్వరరావు, చలివేంద్ర సంఘం అధ్యక్షులు శింగరి మధుసూదనరావు, కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్, ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్త రామకృష్ణ, నాయకులు కొత్తురి విశ్వేశ్వరరావు, ఏలూరి పద్మాకర మురళి కృష్ణ, దేవరశెట్టి రవికుమార్, సుబ్బారాయుడు, చలువాది హరికుమార్, కూరపాటి విజయశంకర్, ఎస్‌వీ రామారావు, కాపుగంటి రమణ, బచ్చు రామసుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, సత్తెనపల్లి కాలభైరవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


రేపు కమ్యూనిస్టు నేత గుల్జార్ సంస్మరణసభ



గుల్జార్ సంస్మరణసభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీడీఎం నాయకులు

నకరికల్లు: చివరిక్షణం వరకు ప్రజల తరపున పోరాడుతూ తన జీవితకాలం ప్రజా ఉద్యమాల్లో పనిచేసిన గుల్జార్ ఆదర్శనీయుడని పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి అన్నారు. కమ్యూనిస్టుగా పనిచేసిన గుల్జార్ సంస్మరణ సభ కరపత్రాలను సోమవారం నకరికల్లులో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వినుకొండలోని కమ్యూనిస్టుపార్టీ కార్యాలయంలో ఈనెల 27న సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజాసంఘాల నాయకులు, అభ్యుదయవాదులు సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎం రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, సీపీఐ నాయకులు కృష్ణనాయక్, మహిళాసంఘం నాయకురాలు పి.సుజాత పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడికి సత్కారం



సత్తెనపల్లి: ఎస్సీ, ఎస్టీ సెల్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ డివిజన్ కమిటీ సభ్యుడిగా ఇటీవల నియమితులైన వేల్పుల అఖిల్‌ను వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు, 24వ వార్డు కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు వేల్పుల అఖిల్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, నాయకులు సంకుల తిరుములరావు, వల్లెం నరసింహరావు, దోని తదితరులున్నారు.